క్లుప్తంగా

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న మహాసముద్రం పట్టాభిరెడ్డి

పాకాల: స్థానిక రైల్వే క్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామాలయం అర్చకులు మురళీ స్వామి, గంగాధరం, సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఆచార్య రాణి సదాశివమూర్తి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఇస్కాన్ వద్దనున్న మైదానంలో ఏర్పాటు చేసిన 16వ భారతీయ పుస్తక మహోత్సవ ప్రదర్శనను శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేదిక్ వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ప్రొఫెసర్ రఘురామరాజు, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సీమ నవలల్లో సామాజిక జీవనం



మాట్లాడుతున్న రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి సిటీ : రాయలసీమ నవలల్లో వ్యాపార ధోరణి ఉండదని, సామాజిక జీవనం ప్రతిబింబిస్తుందని ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎస్వీయూ సెనెట్ హాల్లో 'రాయలసీమ నవలా సాహిత్యం-విశిష్టత' అనే అంశంపై తల్లం పుల్లన్న గుప్త ధర్మనిధి సదస్సు నిర్వహించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విమర్శ అనే నిష్టూరమైన ప్రక్రియను ఎంచుకొని 50 ఏళ్లుగా కొనసాగిస్తున్నానన్నారు. ప్రాంతీయ సాహిత్య అధ్యయనం విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టే క్రమంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని చెప్పారు. తెలంగాణ వారు ప్రాంతీయ సాహిత్య అధ్యయనంలో ముందున్నారని, ఆలస్యంగా నైనా రాయలసీమ సాహిత్యంపై పరిశోధన మొదలైందని తెలిపారు. తొలి తెలుగు నవల శ్రీరంగరాజు చరిత్ర రాయలసీమ నుంచి వచ్చిందన్నారు. ఇక్కడ నుంచి వచ్చిన హిమజ్వాల , కుసుమ ధర్మ పరాగం వంటివి రాయలసీమ అస్తిత్వాన్ని ప్రతిఫలించవని, ముద్ర, శప్తభూమి, కొండపాలం, పెన్నేటి మలుపులు వంటివి రాయలసీమ జీవన శకలాలని వివరించారు. సమావేశానికి తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. ఆచార్య పేటశ్రీ, మేడిపల్లి రవికుమార్, మునిరత్నం, దామోదర నాయుడు, భక్తవత్సల రెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, వీఆర్ రాసాని పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు






ఆలయం వెలుపల బ్రహ్మానందం, సుమ



సునీత

తిరుమల : తిరుమల శ్రీవారిని సినీ నటుడు బ్రహ్మానందం, గాయని సునీత, యాంకర్ సుమ, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎన్వీ బద్రీనాథ్ శనివారం సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

వ్యక్తి ఆత్మహత్య



శివ(ఫైల్)

చంద్రగిరి: మండలంలోని భీమవరం అటవీ ప్రాంతంలో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి వెలుగుచూసింది. వివరాలు.. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలానికి చెందిన పానిపూరి శివ(49) నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల కాపరులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఇంటా జగనన్న సంక్షేమ వెలుగులు

- అన్న మోహిత్‌రెడ్డిని ఆదరించండి
- గడప గడపలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం



సంక్షేమ జాబితాను అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: ప్రతిఇంటా జగనన్న సంక్షేమ వెలుగులు, అభివృద్ధి, ఇతర పథకాలు కొనసాగాలంటే ఎన్నికల్లో తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి పట్టణంలోని అక్కగార్లకాలనీ, బీడీ వర్కర్స్‌కాలనీ, వికలాంగులకాలనీ, జోగులకాలనీలలో శనివారం ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెట్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డిలతో కలసి పర్యటిస్తూ గడప గడపలో సంక్షేమ పథకాల జాబితాలను అందజేశారు. సంక్షేమ జాబితాను చేతబట్టుకుని గుమ్మం ముందుకు వచ్చిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ప్రతి గడపలో ఆత్మీయ స్వాగతం లభించింది. కాలనీలోని దీర్ఘకాలిక సమస్యలను తన వెంట వచ్చిన సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో చర్చించి ఎక్కడికక్కడ పరిష్కారం చేయించేలా హర్షిత్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో స్థానికంగా ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. ప్రతి గడపలో హారతులు పట్టి స్వాగతం పలికిన మహిళలు కరోనా సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకుంటూ తప్పకుండా మోహిత్‌రెడ్డికి అండగా ఉంటామని మాట ఇచ్చారు. నాలుగున్నర ఏళ్లుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన సాయం, అభివృద్ధి పనులను కొనసాగిస్తూ మరో 25 ఏళ్లపాటు ప్రజలందరికీ తోడుగా నిలవాలనుకునే మోహిత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయడంతో ప్రజలందరూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి, ఉప సర్పంచ్ నగరి చంద్ర, నాయకులు మస్తాన్, ముద్దికుప్పం రామ్మూర్తి, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, మట్టా మధుసూదన్ రెడ్డి, కొత్తపాటి కోటి, కొత్తపాటి హరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వరుడు సునీల్‌కుమార్ తల్లిదండ్రులకు సచివాలయం కన్వీనర్ జానకీరాం, పంచాయతీ అధ్యక్షురాలు జ్యోతి, నరేష్ శనివారం ఎమ్మెల్యే పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పసుపు, కుంకుమ, పెళ్లికుమార్తెకు గాజులు, గ్రీటింగ్ కార్డు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు.

డ్వాక్రా మహిళలకు నాటు కోళ్లు సరఫరా



నాటు కోళ్లను అందజేస్తున్న జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి

పాకాల: డ్వాక్రా మహిళలకు అదనపు ఆదాయం సమకూర్చాలని వెలుగు శాఖ ద్వారా నాటు కోళ్లను సరఫరా చేస్తున్నట్లు జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జెడ్పీటీసీ చేతుల మీదుగా ఏపీఎం కోమలాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పాకాల మండలంలో దామలచెరువు, మొగరాల, పాకాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్క యూనిట్ ధర రూ.3000కు విక్రయించినట్లు తెలిపారు. ఒక్క యూనిట్‌లో మొత్తం 11 నాటు కోళ్లు ఉంటాయని, అందులో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని వివరించారు. మండలంలో మొత్తం 100 యూనిట్లు విక్రయించినట్లు తెలిపారు. వెలుగు సీసీలు వెంకటముని, కవిత, సుబ్రమణ్యం, రెడ్డెప్పరెడ్డి, మునిలక్ష్మి, ఎంఎస్ అధ్యక్షురాలు షబానా, సభ్యులు సుజాత, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సిరా రంగులు పుస్తకావిష్కరణ



సిరా రంగులు పుస్తకాన్ని విష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: ఐఏఎస్ అధికారి అభిషేక్ సింహ్ రాసిన హిందీ కవితలను తెలుగులోకి ఆకుల మల్లేశ్వరరావు అనువాదం చేసిన సిరా రంగులు పుస్తకావిష్కరణ సభ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి పాల్గొని సిరా రంగులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమీక్షకుడు గాలి గుణశేఖర్, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, సాహితీ వేత్తలు, కవులు, రచయితలు తమటం రామచంద్రారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, కృష్ణవేణి, సుభద్ర, అరసం అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళీ, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సురేంద్ర రొడ్డా, గొడుగు చింత గోవిందయ్య, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జున, అంకమనాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

శిల్పారామంలో మినీ హస్త కళా మేళా





శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా మేళా

తిరుచానూరు(చంద్రగిరి): శిల్పారామంలో మినీ చేనేత, హస్తకళల మేళాను ఏఓ ఖాదర్‌వల్లీ శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 15 రోజులు పాటు జరిగే ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన 20 మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకం కోసం అందుబాటులో ఉంచారని తెలిపారు.

అగ్రహారం వద్ద చెట్లకు నిప్పు

చంద్రగిరి: తొండవాడ సమీపంలోని అగ్రహారం వద్ద గల స్వర్ణముఖి నది కరకట్టపై ఉన్న చెట్లకు శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

● అపూర్వ సమావేశం



ఎస్వీ మెడికల్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 1968 సంవత్సరం బ్యాచ్ డాక్టర్లు పాల్గొన్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు.

అన్నమయ్య అఖండ సంకీర్తన రేపు

తిరుపతి కల్చరల్: అయోధ్యలో రామమందిర నిర్మాణం పరివార ప్రతిష్టను పురస్కరించుకొని టీటీడీ సౌజన్యంతో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 11 నుంచి 23వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల వరకు 24 గంటలపాటు అన్నమయ్య అఖండ సంకీర్తనా మహాయజ్ఞం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 9.10 గంటలకు టీటీడీ పరిపాలనా భవనం నుంచి అన్నమయ్య ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా రామభజన, నగర సంకీర్తనతో శ్రీకోదండరామాలయం ప్రదక్షిణగా అన్నమయ్య కళామందిరం వరకు చేపట్టనున్నారు. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ జరిగే అభిజిత్ లగ్నంలో అన్నమయ్య అఖండ సంకీర్తనల మహా యజ్ఞం ప్రారంభించే ఈ కార్యక్రమానికి టీటీడీ ఉన్నతాధికారులు, నగర ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు, అన్నమయ్య అభిమానులు, భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఐదేళ్ల వయసులోనే అవార్డు



మాట్లాడుతున్న భువనిక తల్లి కవిత

తిరుపతి కల్చరల్: చిన్నారి భువనిక ఐదేళ్ల వయసులోనే భగవద్గీత శ్లోకాలు, రాముని వంశవృక్ష చరిత్ర, అన్నమయ్య సంకీర్తనల ఆలాపన, లింగాష్టకం, సంస్కృతి శ్లోకాలను వల్లిస్తూ భీష్మ అవార్డు కైవసం చేసుకుందని చిన్నారి తల్లి కవిత తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భువనిక సాధించిన అవార్డును ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ భువనిక ఉత్తమ ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకుందన్నారు. ఫ్యూచర్ అండ్ ప్లే స్కూల్ అకడమిక్ హెడ్ స్వర్ణలత మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి భువనిక అపార మేధస్సుతో అబ్బురపరచడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారిలోని ప్రత్యేక సృజనాత్మకతను గుర్తించి మరింత ప్రోత్సాహం అందించామని తెలిపారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి

తిరుపతి తుడా: అవయవదానంపై అవగాహన మరింత పెరగాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. తిరుపతి సంకల్ప ఆస్పత్రిలో శనివారం అవయవదానంపై అవగాహన సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు గురై బ్రెయిన్‌డెడ్, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరణించినా జీవితం ఉంటుందన్నారు. ఒకప్పుడు చెన్నై, హైదరాబాదు తదితర మహానగరాల్లోని పెద్దపెద్ద ఆస్పత్రుల్లో కోటీశ్వరులకు మాత్రమే అవయవాల మార్పిడి జరిగేదన్నారు. ప్రస్తుతం తిరుపతిలోనూ అవయవాల మార్పిడి విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యం రెడ్డి(భూమన్), సంకల్ప ఆస్పత్రి వైద్యులు బండ్ల నాగేశ్వర్, నాగరాజకుమార్, దగ్గుమాటి శ్రీహరి రావు, ఆనంద్ పాల్గొన్నారు.

వాయుపుత్రుడి వాహన విహారం



తిరుపతి నగరంలో హనుమాన్ శోభాయాత్ర కోసం ఓ వ్యక్తి ఇలా ఆంజనేయుని వేషధారణలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. హనుమంతుడే ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్నట్టు ఉన్న ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి, ఫొటోగ్రాఫర్ తిరుపతి

స్పందన సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు



స్పందన ఫిర్యాదులపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రజల నుంచి వచ్చే స్పందన డయల్ యువర్ కమిషనర్, ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత సూచించారు . కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఏ ఒక్కరు అలసత్వం వహించవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందనను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గాన్ని చూపించాలని ఆమె చెప్పారు. ప్రతి ఫిర్యాదు సీఎం డాష్ బోర్డులో ఉంటుందన్నారు. పరిష్కరించని ఫిర్యాదులు రిమార్కుగా ఉంటాయన్నారు. దీనిపై ప్రభుత్వం సీరియస్గా స్పందిస్తుందని తెలిపారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీగొల్లపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



సీగొల్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

తిరుపతి రూరల్: తిరుపతి శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లిలో శనివారం నుంచి ప్రారంభించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులు వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల మొక్కలను నాటారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వరి, మిరప, జామ తోటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులకు అతి ముఖ్యమైన శిలీంధ్ర నాశకం బోర్డు మిక్సర్ తయారీ విధానాన్ని నేర్పించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసీతారాముల పూజ మహోత్సవాలు రేపు



మాట్లాడుతున్న దిండుకుర్తి నరసింహులు

తిరుపతి కల్చరల్: అయోధ్య రామ మందిరం ప్రారంభం, బాలరాముని ప్రాణప్రతిష్ట నేపథ్యంలో సోమవారం ఆలయాలలో శ్రీసీతారాముల పూజా మహోత్సవాలు ఒక పండుగలా చేపట్టాలని విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, సహ కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆవర్యవైశ్య సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 22న సోమవారం మధ్యాహ్నం 12.29 గంటలకు అయోధ్య రామ మందిరం, బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నారని, ఇదే సమయానికి వాడ వాడలా ప్రతి ఆలయంలో శ్రీసీతారాముల పూజలు, భజనలు, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలతోపాటు రామమందిరం ప్రారంభం దృశ్యాలను టీవీల ద్వారా లైవ్ చూసే అవకాశాలు కల్పించి తేజోమూర్తి శ్రీరామునిపై తమ భక్తి ప్రపత్తులను చాటుతూ అయోధ్య రామ మందిరం ప్రారంభం ఒక పండుగలా చేపట్టాలని పిలుపు నిచ్చారు. నాగరాజ శర్మ, సరళ, రవిచంద్ర, వి.జయరాం పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,874 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,034 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.39 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమతోంది. టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

అయోధ్య శ్రీరామ అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న భాస్కర్, రాజయ్య

తిరుపతి కల్చరల్: అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభాన్ని పురస్కరించుకొని అయోధ్య బాలరాముని పూజిత అక్షింతలు, రామ మందిరం చిత్రపటంను పలువురు ఆధ్యాత్మిక తిరుపతి నగర ప్రజలకు శనివారం భక్తితో పంపిణీ చేశారు. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్‌వారి ఆధ్వర్యంలో శనివారం ప్రకాశం మున్సిపల్ పార్క్‌లోని పర్యాటకులకు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి బెల్లం కొండ సురేష్, శ్రీరామ దూత పొనగంటి భాస్కర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గోపీనాథ్, సుబ్బయ్య, భక్తవత్సలం, కేశవులు, మునిబాబు పాల్గొన్నారు. అలాగే శ్రీరామదూత గంగమ్మ గుడి పాలక మండలి మాజీ సభ్యుడు చెంబుకూరు రాజయ్య ఆధ్వర్యంలో శనివారం బొమ్మగుంట ప్రాంతంలో ప్రజలకు అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు, రామమందిరం చిత్రపటాలను పంపిణీ చేశారు. రవి, వరముని, స్వాతి, సరిత, సుజాత, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు సుబ్బు యాదవ్, గంధం వెంకటముని ఆధ్వర్యంలో నగరంలోని 31వ డివిజన్‌లో ఇంటింటికి శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ చేశారు.